
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023



సోమశిలలో 17.135 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిలలో గురువారం 17.135 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్‌డెల్టాకు1750, ఉత్తర కాలువకు 170, దక్షిణ కాలువకు 254 క్యూసెక్కులు వదులుతున్నారు.



బంగారం ధరలు


24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.61,260
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,519
3శాతం జీఎస్టీతో	రూ.5,685
సవర (8గ్రా)	రూ.45,480

గరిష్టం/కనిష్టం
37.1 /28.0

వాతావరణం

వాతావరణంలో తేమ 85 శాతం ఉంది. జిల్లావ్యాప్తంగా శుక్రవారం కొన్ని మండలాల్లో తేలికపాటి చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

ఆశలు రేకెత్తిస్తున్న స్కాంపీ



దాదాపు రెండు దశాబ్దాల క్రితం జిల్లాలోని ఆక్వా రైతులకు స్కాంపీ రొయ్యల సాగు కాసుల వర్షం కురిపించింది. ఆ తరువాత నాణ్యత లేని సీడ్‌తో వ్యాధులు ప్రబలడం.. ప్రపంచ మార్కెట్‌లో ధరలు ఒడిదొడుకులకు లోనవడంతో రైతులు స్కాంపీ సాగుకు స్వస్తి పలికారు. ప్రస్తుతం సీఫా (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఇన్ ఆక్వాకల్చర్) ఆధ్వర్యంలో హేచరీలు నాణ్యమైన సీడ్‌ను అందిస్తుండడం.. ధరలు, దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో స్కాంపీ సాగు జిల్లాలోని రైతుల్లో ఆశలు రేకెత్తిస్తోంది.

- హేచరీల్లో నాణ్యమైన సీడ్ లభ్యం
- దరిచేరని వైరస్‌లు
- ఆశాజనకంగా ధరలు
- ఆక్వా సాగుకు ప్రభుత్వం చేయూత
- సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు

జిల్లాలో స్కాంపీ సాగు వివరాలు

సాగు చేస్తున్న మండలాలు : 10	సాగు విస్తీర్ణం : 300 ఎకరాలు

అనుమతి పొందిన హేచరీలు: 3



స్కాంపీ రొయ్యలు సాగు చేస్తున్న చెరువు

బుచ్చిరెడ్డిపాళెం: జిల్లాలోని ఆక్వా రైతులు 1995 నుంచి 2002వ సంవత్సరం వరకు మంచినీటి చెరువుల్లో స్కాంపీ రొయ్యలు సాగుచేశారు. అప్పట్లో నెల్లూరు స్కాంపీ రొయ్యలకు మంచి పేరు ఉండేది. వీటి సాగు ద్వారా రైతులు లక్షలాది రూపాయలు సంపాదించారు. అనంతర కాలంలో నాణ్యత లేని సీడ్‌తో వ్యాధులు ప్రబలడం.. ప్రపంచ మార్కెట్‌లో ధరలు ఒడిదొడుకులకు లోనవడంతో స్కాంపీ సాగు కుదేలైంది. తిరిగి స్కాంపీ సాగుకు పునరుజ్జీవం కల్పించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. మంచినీటి స్కాంపీ రొయ్యల విదేశీ ఎగుమతులను ప్రోత్సహిస్తున్నాయి.

జిల్లాలో 300 ఎకరాల్లో సాగు

2002 తరువాత జిల్లాలోని రైతులు స్కాంపీ సాగును వదిలేశారు. వెనామీ రొయ్యల సాగు ఆశాజనకంగా ఉండడంతో ఆ వైపు మళ్లారు. ప్రస్తుతం మళ్లీ జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం, విడవలూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, కోవూరు, ముత్తుకూరు, ఆత్మకూరు, సంగం, నెల్లూరు రూరల్, కొడవలూరు మండలాల్లో దాదాపు 300 ఎకరాల్లో స్కాంపీ సాగు చేస్తున్నారు. దిగుబడులు, ధరలు ఆశాజనకంగా ఉండంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో స్కాంపీకి పూర్వవైభవం వస్తుందనే ధీమాను వ్యక్తం చేస్తున్నారు.

ఐదు నెలల్లో దిగుబడులు

జిల్లాలోని రైతులు చేపలు, స్కాంపీ రొయ్యల మిశ్రమ సాగు చేపడుతున్నారు. స్కాంపీ రొయ్యలు ఐదు నెలల్లో దిగుబడికి వస్తున్నాయి. ఎకరా చెరువులో స్కాంపీ మగ రొయ్య సీడ్ 10 వేల నుంచి 12 వేల వరకు, ఆడ సీడ్ 15 వేల నుంచి 20 వేల వరకు వదులుతున్నారు. ఐదు నెలల్లో ఆడ రొయ్యలు 15 నుంచి 20 కౌంట్, మగ రొయ్యలు 7 నుంచి 10 కౌంట్ వరకు ఎదుగుతున్నాయి. ఎకరాకు సుమారు 1.5 టన్నుల వరకు దిగుబడులు వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

పెట్టుబడులు తక్కువ.. లాభాలు ఎక్కువ

ప్రస్తుతం స్కాంపీ సాగుకు పెట్టుబడులు తక్కువ.. లాభాలు ఎక్కువగా ఉండడంతో రైతులు ఈ సాగువైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం ఎకరా విస్తీర్ణంలో స్కాంపీ సాగుకు ఏడాదికి చెరువు లీజు రూ.50 వేలు, సీడ్ రూ.25 వేలు, ఫీడ్ రూ.50 వేలు, విద్యుత్, ఇతర ఖర్చులు రూ.75 వేలు కలిపి దాదాపు రూ.2 లక్షల వరకు పెట్టుబడులు అవుతున్నాయి. ఐదు నెలలకు సుమారు 1 నుంచి 1.5 టన్నుల వరకు దిగుబడులు వస్తున్నాయి. ప్రస్తుతం టన్ను స్కాంపీ రొయ్యలు మార్కెట్లో రూ.4.50 లక్షల వరకు ధర పలుకుతున్నాయి. మరో వైపు వ్యాధులు తక్కువగా ఉండడంతో మంచి లాభాలు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

సమయం	రొయ్యల కౌంట్
30 రోజులకు	50
60 రోజులకు	40
90 రోజులకు	30
120 రోజులకు	20
150 రోజులకు	15 నుంచి 10

స్కాంపీ సిటీగా నెల్లూరు

1995–2002 సంవత్సరాల మధ్యన ప్రపంచ వ్యాప్తంగా స్కాంపీ రొయ్యల ఎగుమతుల్లో నెల్లూరుకు ప్రాధాన్యం ఉండేది. ఈ కారణంగానే ఇతర దేశాలకు చెందిన వివిధ కంపెనీల ప్రతినిధులు, వ్యాపారులు నెల్లూరుకు వచ్చినప్పుడు ఇక్కడి వ్యాపారులు స్కాంపీ సిటీకి వెల్‌కమ్ అంటూ వారికి స్వాగతం పలికేవారు. కానీ కాలక్రమేణా స్కాంపీ సాగు దెబ్బతినడంతో నెల్లూరుకు ఉన్న ఆ పేరు మరుగునపడింది. అలనాటి ఆ పేరు తిరిగి స్కాంపీ రొయ్యల సాగు ద్వారా వస్తుందని రైతులు, వ్యాపారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం చేయూత

ఆక్వా రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటోంది. ముఖ్యంగా రొయ్య ధరలు తగ్గకుండా ఎప్పటికప్పుడు కమిటీలు వేసి రైతులకు అండగా నిలుస్తోంది. నాణ్యమైన ఫీడ్ సరసమైన ధరలకు రైతులకు అందుబాటులో ఉంచుతోంది. దీంతో పాటు ఆక్వాజోన్ పేరిట ఆక్వా సాగు చేస్తున్న రైతులకు విద్యుత్ చార్జీల్లోనూ రాయితీలు అందజేస్తోంది. ఆక్వాజోన్‌లో లేకపోతే యూనిట్ విద్యుత్‌కు రూ.4.80, ఆక్వా జోన్‌లో ఉంటే రూ.1.50 రాయితీ ఇస్తోంది. దీంతో రైతులు సంతోషంగా ఆక్వా సాగు చేస్తున్నారు.

లాభాలొస్తున్నాయి



జిల్లాలోని ఆక్వా రైతులు దాదాపు 20 ఏళ్ల తరువాత మళ్లీ స్కాంపీ రొయ్యల సాగు చేపడుతున్నారు. నేను ఈ ఏడాది మూడెకరాల్లో స్కాంపీ సాగు చేస్తున్నా. ప్రస్తుతం రొయ్యలకు ఎలాంటి వైరస్‌లు సోకలేదు. దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉన్నాయి. మార్కెట్‌లోనూ మంచి ధరలు ఉండడంతో లాభాలు వస్తున్నాయి.

– రవి, రైతు, చెల్లాయపాళెం, బుచ్చిరెడ్డిపాళెం మండలం

నాణ్యమైన సీడ్ వాడాలి



ప్రస్తుతం జిల్లాలో సిఫా అనుమతులు పొందిన రొయ్య పిల్లల హేచరీలు మూడు మాత్రమే ఉన్నాయి. వాటిలో మాత్రమే నాణ్యమైన సీడ్‌ను తయారు చేస్తున్నారు. వాటి వద్ద మాత్రమే రైతులు సీడ్ కొనుగోలు చేయాలి. కొందరు తక్కువ ధరకు నకిలీ సీడ్ ఇచ్చేందుకు వస్తున్నారు. అలాంటి వారి వద్ద కొనుగోలు చేసి మోసపోవద్దు. రొయ్యల సాగులోనూ జాగ్రత్తలు పాటించాలి.

–శ్రీకాంత్, టెక్నీషియన్

జిల్లాలో మూడు హేచరీలకు అనుమతులు



జిల్లాలో స్కాంపీ రొయ్య పిల్లల ఉత్పత్తికి మహారాజా ఆక్వాటెక్స్, ఏఎస్ఆర్ హేచరీ, బీకేఎంఎం హేచరీలకు మాత్రమే అనుమతులు ఇచ్చాం. మరెక్కడా వాటి ఉత్పత్తికి అనుమతులు ఇవ్వలేదు. మిగిలిన హేచరీలు స్కాంపీ సీడ్ ఉందని చెబితే నకిలీవిగా రైతులు గుర్తించాలి. అలాంటి వారి వివరాలను తమకు తెలియజేయాలి. ప్రభుత్వం ఇస్తున్న విద్యుత్ రాయితీలను ఆక్వా రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

–నాగేశ్వరరావు, జేడీ, మత్స్యశాఖ

న్యూస్‌రీల్

వేదగిరి ఉత్సవాలకు ఆహ్వానం



ఎంపీ వేమిరెడ్డిని ఆహ్వానిస్తున్న ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి

నెల్లూరు రూరల్: నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సెప్టెంబరు 2 నుంచి 5వ తేదీ వరకు జరగనున్న నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, సంప్రోక్షణ, ఏకాహ్నిక బ్రహ్మోత్సవాలకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి దంపతులను ఆ దేవస్థానం చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ గురువారం ఆహ్వానించారు. నగరంలోని నివాసంలో ఎంపీ దంపతులను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. అలాగే జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికలు అందజేసి ఆహ్వానించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని కలెక్టర్ ఎం హరినారాయణన్ పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ తన ఛాంబర్‌లో డీఎంహెచ్ఓ పెంచలయ్య, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, డీసీపీఓ సురేష్‌తో కలిసి బాల్య వివాహాల నిషేధ చట్టంపై రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల జీవితాలపై దారుణ ప్రభావం చూపిస్తాయన్నారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చేసిన, ప్రోత్సహించినా చట్టప్రకారం జైలు, జరిమానా తప్పవని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే బాలల సంరక్షణ యూనిట్ నంబరు 94408 14522కు సమాచారం ఇవ్వాలని కోరారు.

బీమా క్లెయిమ్‌లు సకాలంలో అప్‌లోడ్ చేయండి



మాట్లాడుతున్న పీడీ సాంబశివారెడ్డి

నెల్లూరు (పొగతోట): బీమా క్లెయిమ్‌లను సకాలంలో అప్‌లోడ్ చేసి బాధిత కుటుంబాలకు నగదు అందేలా చర్యలు తీసుకోవాలని డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి మండలాధికారులను ఆదేశించారు. గురువారం ఆయన డీఆర్డీఏ కార్యాలయంలోని తన ఛాంబర్ నుంచి వివిధ మండలాల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యక్తి మరణించిన ముప్పై రోజుల్లో కుటుంబ సభ్యుల ఖాతాల్లో బీమా నగదు జమయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు, సాధారణ మరణం చెందితే రూ.లక్ష అందజేస్తోందని తెలిపారు. సచివాలయాల పరిధిలో మరణించిన వారి వివరాలను కాల్ సెంటర్‌కు అందజేసి పది రోజుల్లో బీమా క్లెయిమ్‌లను అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వీఎస్‌యూ ఈసీ కమిటీ నియామకం

వెంకటాచలం: విక్రమ సింహపురి వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ(ఈసీ)ని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఉన్న కమిటీ మూడేళ్ల గడువు పూర్తవడంతో నూతన కమిటీని నియమించింది. నూతన కమిటీ చైర్మన్‌గా వర్సిటీ వీసీ సుందరవల్లి, సభ్యులుగా వర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ విజయానందకుమార్‌బాబు, ప్రొఫెసర్ సుజా ఎస్ నాయర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సీ కిరణ్మయి, నెల్లూరు ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డీ గిరి, డీకే మహిళా కళాశాల ప్రొఫెసర్ రమాదేవి, ఏపీ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కోట నరసింహారావు, ఉస్మానియా వర్సిటీ పూర్వ ప్రొఫెసర్ కే కుసుమరెడ్డి, డాక్టర్ జీ మైథిలి, హైటెక్ ఫార్మా మార్కెటింగ్ హెడ్ నలుబోలు స్రవంతిను నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ జే శ్యామలారావు ఉత్తర్వులు జారీ చేశారు.

నక్కల కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.10 కోట్లు



పొట్టెంపాడు వద్ద నక్కల కాలువపై శిథిలమైన బ్రిడ్జి

ముత్తుకూరు: మండలంలోని పొట్టెంపాడు వద్ద నక్కలకాలువపై శిథిలమైన వంతెన స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గురువారం రూ.10 కోట్లు విడుదల చేసింది. ఆర్అండ్‌బీ శాఖ జీఓ నంబర్ 261 ద్వారా నిధులను విడుదల చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విజయవాడ నుంచి ఫోన్ ద్వారా వెల్లడించారు. 2022 అక్టోబరు 27న ఏపీజెన్‌కో ప్రాజెక్ట్ మూడో యూనిట్‌ను జాతికి అంకితం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేలటూరుకు వచ్చారు. ఈ సందర్భంగా పిడతాపోలూరు వద్ద నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పొట్టెంపాడు వద్ద నక్కలకాలువపై బ్రిడ్జి శిథిలావస్థకు చేరిన విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నూతన బ్రిడ్జి నిర్మాణానికి రూ.10 కోట్లు అవసరమని విన్నవించారు. దీనికి స్పందించిన సీఎం వైఎస్ జగన్ వెంటనే హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేశారు. ఈ మేరకు నిధుల విడుదలకు ఆర్థిక శాఖ అనుమతి లభించడంతో పొట్టెంపాడు రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీ మేరకు నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్, నిధులు సాధించిన మంత్రి కాకాణికి కృతజ్ఞతలు చెప్పారు.

నేటి నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ

నెల్లూరు (పొగతోట): వైఎస్సార్ పెన్షన్ కానుక ప్రక్రియకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. శుక్రవారం నుంచి జిల్లా వ్యాప్తంగా 3,09,821 మంది లబ్ధిదారులకు రూ.86.10 కోట్ల నగదును పంపిణీ చేయనున్నారు. ఇందుకు సంబంధించి సచివాలయాల పరిధిలో వలంటీర్లకు గురువారం నగదు పంపిణీ చేశారు. వలంటీర్లు వేకువజాము నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందజేయనున్నారు. ఈ నెల 5వ తేదీ వరకు నగదు పంపిణీ చేయనున్నారు.

సమగ్రశిక్షలో అక్రమాలపై గోప్యంగా విచారణ

- మొక్కుబడిగా ఉద్యోగుల నుంచి వివరాలు సేకరణ
- విచారణ విషయాలు బయటకు చెప్పొద్దు
- అవకతవకలు మీడియాలో వస్తే చర్యలు
- అధికారులు, ఉద్యోగులను ఆదేశించిన ఉన్నతాధికారి

నెల్లూరు (టౌన్): సమగ్రశిక్షలోని అక్రమాలపై విచారణ మరోసారి మొక్కుబడిగా సాగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ శాఖలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై సీ మ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య బుధ, గురువారాల్లో గోప్యంగా విచారణ జరిపారు. విచారణాధికారి వచ్చిన విషయం తెలుసుకుని కార్యాలయానికి వెళ్లినా విచారిస్తున్న వారందరిని పంపిన తరువాతే మీడియాను లోనికి అనుమతించారు. ఒక్కో విభాగంలో సెక్టోరియల్ అధికారులు, ఉద్యోగులను విడివిడిగా పిలిచి విచారించాల్సి ఉన్నా అలా చేయలేదని ఆ శాఖ ఉద్యోగులు చెబుతున్నారు. సెక్టోరియల్ అధికారులను అసలు పిలవకుండానే తూతూ మంత్రంగా విచారణ జరిపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకరిద్దరు ఉద్యోగులను పిలిచి మాట్లాడినట్లుగా తెలిసింది. ప్రధానంగా సీజనల్ హాస్టల్స్‌కు సంబంధించిన బిల్లులు గత ఆరు నెలలుగా నిలిచిపోయాయి. దీంతో హాస్టళ్లు నిర్వహిస్తున్న ఎన్జీఓలు సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సీజనల్ హాస్టళ్లు నిర్వహిస్తున్న ఎన్జీఓలను విచారణకు పిలిచారు. ఆ విభాగంలో పనిచేస్తున్న ఒకరిద్దరు ఉద్యోగులను పిలిచి మాట్లాడినట్లు చెబుతున్నారు. అదే విధంగా కలెక్టర్, సమగ్రశిక్ష ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా అద్దె వాహనాల ఏర్పాటు వ్యవహారాన్ని ఆయన తేలికగా తీసుకున్నట్లు తెలిసింది. ఐఈ వింగ్‌లో జరుగుతున్న కార్యక్రమాలకు సంబంధించిన బిల్లులపై ఇతరులు సంతకాలపైన విచారించినట్లుగా సమాచారం లేదు.

పత్రికల్లో వస్తే చర్యలు తప్పవు

సమగ్రశిక్షలో జరుగుతున్న విషయాలు, అవినీతి, అక్రమాలు పత్రికల్లో వస్తే అధికారులు, ఉద్యోగులపై చర్యలు తప్పవని ఆ శాఖ ఉన్నతాధికారి అనధికారిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఏం జరిగినా మనకు మనమే చూసుకోవాలే తప్ప బయటకు ఎందుకు చెబుతున్నారో అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. విచారణకు వచ్చిన మస్తానయ్య కూడా సంబంధిత విభాగాల అధికారులు, ఉద్యోగులకు అన్ని విషయాలు బయటకు పొక్కకుండా జాగ్రత్తలు పడాలని సలహా ఇచ్చినట్లు చెబుతున్నారు. విచారణకు వచ్చిన అధికారి ఇలాంటి సలహాలు ఇవ్వడమేమిటని ఆ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులే గుసగుసలాడుతున్నారు. సమగ్రశిక్షలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణకు వచ్చిన సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్యను 'సాక్షి' సంప్రదించగా సాధారణ తనిఖీల్లో భాగంగా నెల్లూరుకు వచ్చామని చెప్పారు. పనిలో పనిగా పత్రికల్లో వచ్చిన కథనాలపైన అధికారులు, ఉద్యోగుల నుంచి సమాచారం తెలుసుకున్నట్లు తెలిపారు.

వేగవంతంగా ప్లాంటేషన్లు



మాట్లాడుతున్న వెంకట్రావ్

నెల్లూరు (పొగతోట): జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన భూముల్లో ప్లాంటేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని డ్వామా పీడీ వెంకట్రావ్ ఆదేశించారు. నగరంలోని డ్వామా కార్యాలయం నుంచి వివిధ మండలాల అధికారులతో గురువారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అవెన్యూ ప్లాంటేషన్‌కు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్లాంటేషన్ నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వంద రోజుల పనులను పూర్తి చేసిన కుటుంబాల్లోని మహిళలకు వివిధ రంగాల్లో ఉచిత శిక్షణను ఇవ్వనున్నామని తెలిపారు. దీనికి సంబంధించి 18 నుంచి 35 ఏళ్లలోపు వారి వివరాలను అందజేయాలని సూచించారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలి

- కలెక్టర్ ఎం హరినారాయణన్





తాగునీటి సౌకర్యంపై సమీక్షిస్తున్నకలెక్టర్ ఎం హరినారాయణన్, హాజరైన జిల్లా అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ఎం హరినారాయణన్ అన్నారు. గురువారం కలెక్టర్ తన ఛాంబర్‌లో వైద్యారోగ్య, ఐసీడీఎస్, విద్య, డీఆర్‌డీఏ, ప్రణాళిక శాఖల అధికారులతో సమావేశమయ్యారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో ప్రాధాన్యత ఇండికేటర్స్ లక్ష్యసాధనకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.అందులో భాగంగా 10 నుంచి 19 ఏళ్లలోపు బాలబాలికలు, 15 నుంచి 49 ఏళ్లలోపు గర్భిణులకు ప్రతి నెలా వైద్యపరీక్షలు నిర్వహించాలని సూచించారు. రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఐరన్ మాత్రలు, అదనపు పౌష్టికాహారం అందజేయాలని తెలిపారు. బరువు, ఎత్తు తక్కువగా ఉన్న అంగన్‌వాడీ చిన్నారులకు పౌష్టికాహారం అందజేయాలన్నారు. విద్యార్థుల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోను 100 శాతం సాధించాలని ఆదేశించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యత ఇండికేటర్స్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సచివాలయాల వారీగా డేటాను రూపొందించి ఆయా శాఖలు చేపడుతున్న కార్యక్రమాల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు.

సురక్షిత తాగునీటి సదుపాయం కల్పించాలి

జిల్లాలోని వసతిగృహాలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో సురక్షిత తాగునీటి సదుపాయం కల్పించాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ తన ఛాంబర్‌లో సంక్షేమ, వైద్యారోగ్య, పరిశ్రమలు, గనులు, వాణిజ్య, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సురక్షిత తాగునీటి సదుపాయం లేని సంక్షేమ వసతి గృహాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులను గుర్తించాలని సూచించారు. వాటిలో కార్పొరేట్ సెక్టార్ వారి సహకారంతో సురక్షిత తాగునీటి సదుపాయం కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఎంహెచ్ఓ పెంచలయ్య, జిల్లా ప్రణాళికాధికారి సాలెం రాజు, పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్, మైన్స్ డీడీ శ్రీనివాస్, జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఏ రవీంద్రనాథ్‌రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ రాజశేఖర్, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, ఐటీడీఏ పీఓ మందా రాణి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, గిరిజన సంక్షేమ అధికారి పరిమళ, గురుకులాల డీసీఓ హేమలత పాల్గొన్నారు.

పాడైన ట్యాబ్‌ల స్థానంలో కొత్తవి అందజేత



లోపాలు సరిదిద్దిన, కొత్త ట్యాబ్‌లను చూపుతున్న విద్యార్థులు

నెల్లూరు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లు మరమ్మతులకు గురైనా, పగిలిపోయినా వాటి స్థానంలో కొత్తవి అందజేస్తున్నట్లు స్టేట్ ఐటీ మానిటరింగ్ ఆఫీసర్ రమేష్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బైజూస్ ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీ ప్యానల్ లోపాల సవరణలో భాగంగా గురువారం వెంకటాచలం మండలం గొలగమూడిలోని మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ పాఠశాలలోని 80 మంది విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలించి లోపాలను సరిదిద్దారు. అలాగే నెల్లూరులోని కేఎన్నార్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలించారు. సాఫ్ట్‌వేర్ లోపాలను సరిదిద్దారు. పగిలిపోయిన 20 ట్యాబ్‌లకు బదులు కొత్తవి ఇచ్చారు. పనిచేయని ఎస్డీ కార్డుల స్థానంలో కొత్తవి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాబ్‌ల్లోని సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. స్క్రీన్ పగిలిపోయిన ట్యాబ్‌లను సమీపంలోని సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ లేదా వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌కు అందజేస్తే వారు శ్యామ్‌సంగ్ కంపెనీలో రిపేర్ చేయించి ఇస్తారని తెలిపారు.

క్లుప్తంగా

వీఎస్‌యూలో న్యాక్ బృందం పరిశీలన



వర్సిటీలో వివరాలు తెలుసుకుంటున్న న్యాక్ బృందం

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయానికి నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (న్యాక్) బృందం గురువారం విచ్చేసింది. దీనికి యూనివర్సిటీ ఆఫ్ మైసూర్ వీసీ హేమంత్‌కుమార్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. బుందేల్‌ఖండ్ యూనివర్సిటీ డీన్ అనింధ్య, అస్సాం యూనివర్సిటీ ప్రొఫెసర్ అనింధ్య శ్యామ్‌చౌదరి, యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ (చెపాక్ క్యాంపస్) రిజిస్ట్రార్ ఏలుమలై, గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ పరాగ్ బృందంలో సభ్యులుగా ఉన్నారు. వారికి వీఎస్‌యూ వీసీ సుందరవల్లి స్వాగతం పలికి వర్సిటీ ప్రగతిపై పవర్‌పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చారు. భవిష్యత్ ప్రణాళికల గురించి వివరించారు. అనంతరం న్యాక్ బృందం వర్సిటీలోని వివిధ విభాగాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వర్సిటీకి న్యాక్‌లో మంచి గ్రేడ్ వస్తే అన్ని విధాలుగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ పి.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చుక్కలదుప్పి మృతి



దాడిలో చనిపోయిన దుప్పి

ఉదయగిరి: కుక్కలు దాడి చేయడంతో చుక్కల దుప్పి మృతిచెందిన ఘటన గురువారం పట్టణంలోని షబ్బీర్ కాలనీలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. అటవీ ప్రాంతం నుంచి తాగు నీటి కోసం కాలనీలోకి వచ్చిన చుక్కల దుప్పిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు చూసి కుక్కలను తరిమి దుప్పిని కాపాడే ప్రయత్నం చేశారు. వెంటనే సమాచారాన్ని అటవీ శాఖ అధికారులకు తెలియజేయడంతో రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి, డీఆర్వో శ్రీనివాసులు తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే దుప్పి మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం ఖననం చేశారు.

యువకుడి ఆత్మహత్య

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలంలోని ఎల్లారెడ్డికొట్టాలుకు చెందిన మానికల మురళి (25) అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో గడ్డి మందు తాగాడు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. గురువారం పోలీసులు వివరాలు వెల్లడించారు. మురళి అనంతసాగరం మండలం పాతాళపల్లి సచివాలయ పరిధిలోని ఆర్బీకేలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అతడికి ఆర్థికపరమైన సమస్యలున్నాయి. ఈ క్రమంలో గత నెల 25వ తేదీన గడ్డి మందు తాగడంతో బంధువులు గుర్తించి బద్వేల్ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి తెలిపారు.

గేదెను తప్పించబోయి..

• మినీలారీ బోల్తా



ఘటనా స్థలంలో మినీలారీ

వరికుంటపాడు: మినీలారీ అదుపుతప్పి బోల్తాపడిన ఘటన గురువారం తెల్లవారుజామున మండల కేంద్రమైన వరికుంటపాడు ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గుంటూరు నుంచి మదనపల్లెకు థమ్సప్ బాటిళ్ల లోడుతో మినీలారీ వెళ్తోంది. ఆ వాహనం వరికుంటపాడు సమీపంలోకి వచ్చేసరికి గేదె అడ్డురావడంతో డ్రైవర్ దానిని తప్పించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో డ్రైవర్, క్లీనర్ స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు వారిని వెంటనే వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

మంచి చేశాం.. ప్రజల్లోకి వెళ్తున్నాం



లక్ష గడపల సాధకుడు పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, చిత్రంలో నాయకులు

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు ఎంతో మంచి చేశారు. అందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నాం.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని మైపాడులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మేనిఫెస్టోలో లేని పథకాలను సైతం సీఎం జగన్ అమలు చేస్తూ ప్రజల్లో మంచిపేరు తెచ్చుకొన్నారన్నారు. ఆ పేరును ఎలాగైనా చెడగొట్టాలని చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. వారికి ఎల్లో మీడియా తోడైందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి సానుకూల పరిస్థితి ఉండడాన్ని చూసి బాబు, పవన్‌లకు కడుపు మండుతోందన్నారు. ఓటర్లు వారిని పట్టించుకోవడంలేదని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే సీఎం చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పవన్ రౌడీయిజాన్ని, పిచ్చి చేష్టలను అందరూ గమనిస్తూనే ఉన్నారని వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, జెడ్పీ ఉపాధ్యక్షురాలు శ్రీహరికోట జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'లక్ష గడపల సాధకుడు ప్రసన్నన్న' పోస్టర్ ఆవిష్కరణ

నెల్లూరు(దర్గామిట్ట): కోవూరు నియోజకవర్గంలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఇందుకూరుపేట మండలం మైపాడు పంచాయతీలో లక్ష గడపలను ఆదివారం పూర్తి చేసుకోనున్న తరుణంలో 'లక్ష గడపల సాధకుడు ప్రసన్నన్న' అనే పేరుతో రూపొందించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో వీటిని ఆవిష్కరించిన అనంతరం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నియోజకవర్గంలో విజయవంతంగా జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

కావలి నియోజకవర్గంలో శరవేగంగా అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కావలి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు శరవేగంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బోగోలు పంచాయతీ కార్యాలయ ఆవరణలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత నియోజకవర్గ ప్రగతికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. కీలకమైన రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లతోపాటు అభివృద్ధి కార్యక్రమాల కోసం భారీగా నిధులు కేటాయించినట్లు వివరించారు. అదే విధంగా ఒక్క బోగోలు మండలంలోనే సంక్షేమ పథకాల రూపంలో రూ.వంద కోట్ల వరకూ ప్రజలకు పేదలకు లబ్ధి చేకూర్చినట్లు చెప్పారు. రాజకీయాలకు తావులేకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా పేదలకు పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలోని సమస్యలు, ఇతర అంశాలపై కార్యకర్తలతో చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిబోయిన వీరరఘు, తూపిలి పెంచలయ్య, పాశం రవీంద్రబాబు, నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడు సుంకే మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కొండాపురం: సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటుచేసి ప్రతి గడపకు సంక్షేమ పథకాలను చేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఇస్కదామెర్ల పంచాయతీ పొట్టిపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డు మల్లికార్జున ఆధ్వర్యంలో మేకపాటికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కులమతాలు, రాజకీయ పార్టీలకతీతంగా పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయన్నారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎల్లవేళలా అందుబాటులో ఉండే తనను ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలపై స్థానిక అధికారులతో చర్చించి త్వరగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిమిలి రవీంద్ర, ఎంపీపీ బి.అనూరాధ, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ యారవ నరసింహారావు, సర్పంచ్ ఇరగల శేఖర్‌రెడ్డి, నాయకులు బి.మాధవరెడ్డి, మల్లికార్జునరెడ్డి, మోహన్, తిరుపాలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

• సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య



మాట్లాడుతున్న సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య

నెల్లూరు(టౌన్): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య తెలిపారు. గురువారం ఆయన నెల్లూరులోని సమగ్ర శిక్ష కార్యాలయంలో సాక్షితో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 45 వేల పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ప్రథమ్ ఆర్గనైజేషన్ సహకారంతో మూడు విడతల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. తొలివిడతలో 6,700 హైస్కూల్స్, యూపీ, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అడ్మినిస్ట్రేషన్, అకడమిక్, స్కూల్ లీడర్‌షిప్‌పై ఆరురోజులపాటు రెసిడెన్షియల్ ట్రైనింగ్ ఇచ్చామన్నారు. అదే విధంగా అంగన్‌వాడీలు, 1, 2 తరగతుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఫౌండేషన్ లిట్రసీ అండ్ న్యూమరసీ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ ఆర్పీలుగా ఆరువేల మందిని ఎంపిక చేసి పునాదిలో అభ్యసనా సామర్థ్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణను మూడు విడతలుగా మూడేళ్లలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

నగదు వసూలు చేస్తే కఠిన చర్యలు

కావలి: 'రామాయపట్నం పోర్టు నిర్వాసితులకు కావలిలో ఇంటి స్థలాలు ఇచ్చేందుకు ఎలాంటి ప్రతిపాదనలు లేవు. ఇళ్ల స్థలాల పేరుతో ఎవరైనా వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.' అని కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్ తెలిపారు. కందుకూరు నియోజకవర్గంలో నిర్మిస్తున్న రామాయపట్నం పోర్టుకు సంబంధించిన నిర్వాసితులకు కావలిలో ఇంటి స్థలాలు ఇస్తారని, నిర్వాసితుల జాబితాలో పేరు ఉండాలంటే నగదు ఇవ్వాలంటూ ఓ వ్యక్తి వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆర్డీఓ గురువారం స్పందిస్తూ దీనిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే పోలీసు కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజలకు మరింత మెరుగైన సేవలు

• కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(పొగతోట): 'ప్రభుత్వం అందించే శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగించుకోండి. క్షేత్రస్థాయిలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలి.' అని కలెక్టర్ ఎం.హరినారాయణన్ పిలుపునిచ్చారు. పంచాయతీ కార్యదర్శులకు నెల్లూరులోని కొండాయపాళెంలోని సమావేశ మందిరంలో జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం కలెక్టర్ ఎం.హరినారాయణన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతా మనకు తెలుసనే భావన సరికాదని, శిక్షణ వలన కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమాలతో ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. కేవలం ఆషామాషీగా హాజరు కాకుండా మంచి ఆలోచన, నేర్చుకోవాలనే స్ఫూర్తితో ఉండాలన్నారు. ఇక్కడ నేర్చుకున్న ప్రతి అంశం పరిపాలనలో ఉపయోగపడుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శి పోస్ట్ చాలా కీలకమైందన్నారు. తమ పరిధిలోని గ్రామాల్లో ఏ మేరకు మార్పు తీసుకురాగలమనే సంకల్పంతో పనిచేయాలన్నారు. పరిపాలనలో వివిధ రకాల ఒత్తిళ్లు సహజమని, వాటిని అధిగమించి పనిచేసినప్పుడే సంతృప్తి కలుగుతుందన్నారు. జిల్లా పంచాయతీ అధికారి సుస్మితారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అందరు పంచాయతీ కార్యదర్శులకు ఆరురోజులపాటు నాలుగు విడతలుగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రెండురోజులపాటు క్షేత్రస్థాయికి తీసుకెళ్లి సమగ్ర శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన పట్టాలకే హక్కులు



మాట్లాడుతున్న ఆర్డీఓ సాధు కరుణకుమారి

ఆత్మకూరు: 'సంవత్సరాల తరబడి డీకేటీ భూములు అనుభవిస్తున్న రైతులకు హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం జీఓను విడుదల చేసింది. అయితే గతంలో ఇచ్చిన పట్టాదారుల వద్దనే భూములు ఉండి అనుభవిస్తుంటేనే హక్కులు వస్తాయి.' అని ఆత్మకూరు ఆర్డీఓ సాధు కరుణకుమారి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఆమె రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీఓను పలువురు సరిగ్గా అర్థం చేసుకోకుండా వక్రీకరిస్తున్నారన్నారు. జారీ చేసిన డీకేటీ పట్టాల భూములు సంబంధిత లబ్ధిదారులైన రైతుల వద్ద ఉండాలన్నారు. 20 ఏళ్లకుపైబడి అనుభవిస్తున్న అసలైన లబ్ధిదారులకే ఈ జీఓ మేరకు హక్కులు వస్తాయని వివరించారు. గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన డీకేటీ పట్టాలు ఎవరు కొనుగోలు చేసినా, 20 ఏళ్లకు మించి వారి ఆధీనంలో ఉన్నా హక్కులు రావని వారు ఆక్రమణదారులుగానే గుర్తించబడతారని తెలిపారు. సోమవారం కలెక్టర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఇప్పటి వరకు స్పందనలో పరిష్కరించిన సమస్యలను పరిష్కరించాల్సిన వాటి గురించి కలెక్టర్‌కు అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ సుభద్ర, తహసీల్దార్ లక్ష్మీనరసింహం, డీటీ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

• ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు
• పొదుపు మహిళలకు అవగాహన



పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పిస్తున్న డీడీ సురేష్

ఆత్మకూరు: మహిళలు అవకాశాలను అందిపుచ్చుకుని పరిశ్రమలు స్థాపించి భవిష్యత్ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. ఆత్మకూరు వైఎస్సార్ క్రాంతిపథం ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయంలో గురువారం పొదుపు మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెలుగు ఏసీ వెంకటేశ్వరరావు, ఏపీఎం డి.వెంకమ్మ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల ఉమెన్‌లెడ్ ఎంటర్‌ప్రైజెస్‌కు ఎంపికైన మహిళలు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా పరిశ్రమలు స్థాపించేందుకు ప్రభుత్వంలోని పలు శాఖలు సిద్ధంగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డ్వాక్రా మహిళలకు వ్యక్తిగతంగా రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు బ్యాంక్ రుణాలు ఇప్పించడం జరుగుతుందన్నారు. తయారీ రంగంలో పరిశ్రమలు స్థాపిస్తే రూ.50 లక్షల వరకు పెట్టుబడి సహాయం అందుతోందన్నారు. సేవా రంగంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే రూ.20 లక్షల ఆర్థిక రుణాలు మంజూరవుతాయని వీటిలో రూ.35 శాతం వరకు సబ్సిడీ ఉంటుందని తెలిపారు. ఖాదీ బోర్డు డీడీ సురేష్ మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అనేక పరిశ్రమలు స్థాపించేందుకు అవకాశం ఉందన్నారు. ఆర్థిక స్థిరత్వం పొందేందుకు పొదుపు గ్రూపు మహిళలు జట్లుగా ఏర్పడి రుణాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ ఫైనాన్స్ లిట్రసీ కో–ఆర్డినేటర్ రవిశంకర్, పరిశ్రమల శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, ఫుడ్ ప్రాసెసింగ్ డీఆర్పీ వెంకటేశ్వర్లు, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

కారు టైరు ఊడిపోవడంతో..

• రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి




ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ ఫిరోజ్

కలిగిరి: మండలంలోని నాగసముద్రం వద్ద కావలి – ఉదయగిరి ప్రధాన రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో పువ్వాడి మాలకొండయ్య (55) అనే వ్యక్తి గురువారం అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. వింజమూరు మండలం చౌటపల్లికి చెందిన మాలకొండయ్య కుటుంబం హైదరాబాద్‌లో నివాసం ఉంటోంది. ఆయన లారీ ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం చేస్తుంటాడు. మాలకొండయ్య కుటుంబంతో కలిసి హైదరాబాద్ నుంచి స్వగ్రామం చౌటపల్లికి కారులో బయలుదేరాడు. అతడి కుమారుడు కిశోర్ వాహనం నడుపుతున్నాడు. ఈ క్రమంలో నాగసముద్రం వద్ద వస్తుండగా ఒక్కసారిగా కారు టైరు ఊడిపోవడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ముందు సీట్‌లో మాలకొండయ్య కూర్చొని ఉన్నాడు. కారు డోరు తెరుచుకుని ఆయన బయటకు వాలిపోయి కొంత దూరం ఈడ్చుకెళ్లడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మాలకొండయ్య భార్య జయలక్ష్మికి స్వల్పగాయాలయ్యాయి. కుమారుడు కిశోర్, కోడలు వాణిశ్రీ, సంవత్సరం వయసున్న మనుమడు జయంత్ సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న కలిగిరి సీఐ ఎండీ ఫిరోజ్ ఏఎస్సై సుబ్బారావు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.55
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.9



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 145
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 248
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 276
లేయర్ చికెన్	: 178